RNI No: APTEL /25/A2860


# సీమ వార్త సాయంకాలం

అనంతపురం | సంపుటి : 1 | సంచిక : 109 | పేజీలు : 4 | గురువారం 22 అక్టోబర్ 2026 | ఎడిటర్ : బీరే ఈశ్వరయ్య | వెల : 2/-




## హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో రహస్యాల లీక్..

ఇద్దరు కీలక అధికారులపై విచారణ!



## తిరుమలలో తగ్గిన భక్తుల రద్దీ..

- 6 గంటల్లోనే శ్రీవారి సర్వదర్శనం.. తిరుమలలో గణనీయంగా తగ్గిన భక్తుల రద్దీ
- ప్రస్తుతం 12 కంపార్ట్‌మెంట్లలో వేచి ఉన్న భక్తులు.. సర్వదర్శనం 6 గంటల్లో పూర్తి
- బుధవారం శ్రీవారిని దర్శించుకున్న 73 వేల మంది భక్తులు
- హుండీ ద్వారా రూ. 2.66 కోట్ల ఆదాయం




## పవన్ కల్యాణ్ రాజీనామా అంటూ
# వాట్సాప్‌లో తప్పుడు ప్రచారం

- పవన్ రాజీనామా అంటూ ఫేక్ న్యూస్
- సైబర్ చర్యల హెచ్చరికతో క్షమాపణ చెప్పిన వాట్సాప్ గ్రూప్ అడ్మిన్
- చర్యల భయంతో బహిరంగ క్షమాపణ చెప్పిన వాట్సాప్ గ్రూప్ అడ్మిన్
- సోషల్ మీడియాలో చూసి, నిర్ధారించుకోకుండా షేర్ చేశానని వెల్లడి

అమరావతి

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తన పదవికి రాజీనామా చేస్తున్నారంటూ వాట్సాప్‌లో తప్పుడు సమాచారాన్ని సర్క్యులేట్ చేసిన ఓ వాట్సాప్ గ్రూప్ అడ్మిన్ క్షమాపణలు చెప్పారు. ఈ ఫేక్ న్యూస్‌ను తీవ్రంగా పరిగణించిన ఉప ముఖ్యమంత్రి కార్యాలయం సైబర్ క్రైమ్ విభాగానికి ఫిర్యాదు చేయాలని నిర్ణయించడంతో, సదరు అడ్మిన్ వెనక్కి తగ్గారు. సోషల్ మీడియాలో వచ్చిన ఒక పోస్ట్ చూసి, నిజానిజాలు నిర్ధారించుకోకుండా "పవన్ కల్యాణ్ డిప్యూటీ సీఎం పదవికి రాజీనామా" అని గ్రూప్‌లో షేర్ చేసినట్లు అడ్మిన్ తన వివరణలో తెలిపారు. ఇది ఎలాంటి దురుద్దేశంతో జరగలేదని, పొరపాటున జరిగిందని పేర్కొన్నారు. ఈ ఘటనపై పవన్ కల్యాణ్‌కు, జనసేన నాయకులకు, కార్యకర్తలకు, గ్రూప్ సభ్యులకు మనస్ఫూర్తిగా క్షమాపణ చెబుతున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో పూర్తి వివరాలు తెలుసుకున్నాకే పోస్టులు షేర్ చేస్తానని హామీ ఇచ్చారు. - మిగతా 3లో

## వైసీపీ ఎత్తుగడలను తిప్పికొట్టేందుకు
# ఉమ్మడి కార్యాచరణ



## ఏపీకి మరో తుపాను ముప్పు?

- బంగాళాఖాతంలో అనుకూల పరిస్థితులు!
- బంగాళాఖాతంలో కొత్తగా ఏర్పడిన వాతావరణ వ్యవస్థ
- అండమాన్ సమీపంలో ఉపరితల ఆవర్తనం గుర్తింపు
- అక్టోబర్ 23 నాటికి అల్పపీడనంగా మారే అవకాశం
- పశ్చిమ వాయువ్య దిశగా కదులుతూ ఏపీ తీరం వైపు రావొచ్చని అంచనా



- ప్రొటోకాల్ లేకుండా నేరుగా చంద్రబాబు నివాసానికి పవన్.. పరిషత్ పోరుపై కీలక మంతనాలు!
- సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో హుటాహుటిన భేటీ
- ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల వ్యూహంపై ఇరువురు నేతల చర్చ
- కూటమిలో సీట్ల సర్దుబాటు, నామినేషన్లపై కీలక నిర్ణయాలు

అమరావతి

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఊహించని, ఆసక్తికరమైన సన్నివేశం చోటుచేసుకుంది. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఎలాంటి అధికారిక హంగు ఆర్భాటాలు లేకుండా అత్యంత సాధారణ వ్యక్తిలా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నివాసానికి చేరుకున్నారు. సైరన్ మోగించే కాన్వాయ్ గానీ, భద్రతా సిబ్బంది గానీ లేకుండా ఆయన నేరుగా సీఎం ఇంటికి వెళ్లడం అందరినీ ఆశ్చర్యపరిచింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో నామినేషన్లపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసిన కొన్ని గంటల్లోనే ఈ భేటీ జరగడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో నామినేషన్లు వేయలేకపోయిన వారికి మరో 48 గంటల - మిగతా 3లో



## ప్రకృతితో ఘర్షణ వద్దు..
# విపత్తులను తప్పించలేం

- 'అలయ్ బలయ్'లో వెంకయ్యనాయుడు
- ప్రకృతితో మమేకమై జీవించాలని సూచించిన వెంకయ్యనాయుడు
- రాజకీయాలకు అతీతంగా హాజరైన వివిధ పార్టీల నేతలు
- 'నషా ముక్త్ భారత్ - వికసిత్ భారత్' ఇతివృత్తంతో కార్యక్రమం



## బతుకమ్మ పూల చెత్తతో
# సిరుల పంట

- వరంగల్ బల్దియా అదిరిపోయే ప్లాన్.. వీడియో చూడండి..
- పారేస్తే చెత్త... ఒడిసిపడితే కోట్లాది రూపాయల సంపద..
- పండుగ వేళ వాడిన 60 టన్నుల పూలను సేకరించి..
- భూమికి బలాన్నిచ్చే మేలైన బయో కంపోస్ట్ ఎరువుగా మారుస్తూ సరికొత్త రికార్డు సృష్టిస్తోంది. ఆ వివరాలు ఈ స్టోరీలో తెలుసుకుందాం..

హైదరాబాద్

వృథాగా పారేస్తే అది పర్యావరణానికి చేటు తెచ్చే చెత్త.. అదే కాస్త ఆలోచించి సద్వినియోగం చేసుకుంటే అద్భుతమైన సంపద.. తెలంగాణ సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాలు ముగిశాయి. అయితే పండుగ వేళ వాడిన టన్నుల కొద్దీ పూల వ్యర్థాలను కాస్త అధికారులు రికొత్త రీతిలో సంపదగా మారుస్తున్నారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్ సిబ్బంది పూల వ్యర్థాలతో నాణ్యమైన సేంద్రియ ఎరువును తయారు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. - మిగతా 3లో


## బీసీ కులగణనలో తప్పులుంటే
# సరిచేస్తాం



- సీఎం రేవంత్ కీలక ప్రకటన
- వివరాలు నమోదు కానివారు ప్రభుత్వానికి తెలియజేయాలని సూచన
- పచ్చే కేబినెట్‌లో కులగణన లెక్కలపై చర్చ
- ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చే అంశాన్ని పరిశీలిస్తామని హామీ
- ముదిరాజ్ నాయకులకు మరిన్ని అవకాశాలు కల్పిస్తామని హామీ
- పండుగ సాయన్న, దొడ్డి కొమురయ్య విగ్రహాల ఏర్పాటుకు హామీ

హైదరాబాద్

బీసీ కులగణనలో తమ వివరాలు నమోదు కాలేదని భావించే వారు ముందుకొస్తే లెక్కలను సరిచేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. అవసరమైతే బీసీ జనాభా లెక్కలను సవరించి, జాబితాలోకి రాని వారిని చేర్చుతామని స్పష్టం చేశారు. బీసీ వర్గాలకు సామాజిక న్యాయం చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో నిర్వహించిన పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి వేడుకల్లో సీఎం పాల్గొని మాట్లాడారు. వందేళ్లలో ఎవరూ చేయని సాహసం తమ ప్రభుత్వం చేసిందని, ఏడాదిలోనే కులగణన పూర్తి చేసి తొలిసారిగా బీసీల జనాభా లెక్కలను తేల్చామని అన్నారు. ఏ కులం వారైనా తమ జనాభా తక్కువగా - మిగతా 3లో



## ఎంత వరకైనా
# పోరాడదాం

- వైసీపీ ముఖ్య నేతలతో ఆ పార్టీ అధినేత జగన్ భేటీ
- స్థానిక ఎన్నికలకు సంబంధించి సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో చర్చ
- చంద్రబాబు ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా హింసకు పాల్పడుతోందని ఆరోపణ

## అందుకే కేటీఆర్ గడ్డం పెంచుతున్నారట..

- గడ్డం పెంచుకుంటే ముఖ్యమంత్రి అవుతారని ఎవరో చెప్పడంతోనే కేటీఆర్ అలా చేస్తున్నారని వ్యంగ్యాస్త్రాలు
- గతంలో కేసీఆర్ పాత సచివాలయానికి వెళ్తే ఓడిపోతారని ఎవరో చెప్పడంతో కొత్త సచివాలయం నిర్మించారని వ్యాఖ్య
- కేటీఆర్ గడ్డం పెరుగుతుందేమో కానీ సీఎం మాత్రం కాలేరంటూ అర్వింద్ ఎద్దేవా
- 2028లో తెలంగాణలో కాషాయ సునామీ ఖాయమన్న అర్వింద్
- రేవంత్‌రెడ్డిపై హైకమాండ్ అసంతృప్తిగా ఉందని వ్యాఖ్య



గురువారం 22 అక్టోబర్ 2026

సీమ వార్త సాయంకాలం

అనంతపురం జిల్లా/ సత్యసాయి (పుట్టపర్తి) జిల్లా

## స్థానిక ఎన్నికలను ఎదుర్కొనే
# ధైర్యం వైసీపీకి లేదు!

రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సామకోటి ఆదినారాయణ



పుట్టపర్తి అక్టోబర్ 22 సీమ వార్త సాయంత్రం.

స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజల తీర్పును ఎదుర్కొనే ధైర్యం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి లేదని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సామకోటి ఆదినారాయణ విమర్శించారు.బీసీలకు రాజకీయంగా సముచిత ప్రాధాన్యత కల్పిస్తూ, రిజర్వేషన్ల కోసం కృషి చేస్తున్న తెలుగుదేశం పార్టీపై వైసీపీ కక్షపూరిత రాజకీయాలకు పాల్పడుతోందని ఆయన ఆరోపించారు. వ్యవస్థలను అడ్డుపెట్టుకొని, అధికారులపై ఒత్తిళ్లు తీసుకురావడం, న్యాయస్థానాల ఆదేశాలను తమకు అనుకూలంగా అన్వయించుకోవడం ద్వారా స్థానిక సంస్థల ఎన్నికలకు ఆటంకాలు సృష్టించే ప్రయత్నం జరుగుతోందని పేర్కొన్నారు. జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలోని వైసీపీ, ఎన్నికలు సజావుగా జరగకుండా అడ్డంకులు సృష్టించేందుకు ప్రయత్నిస్తోందని సామకోటి ఆదినారాయణ విమర్శించారు. ఎన్నికలను వాయిదా వేయాలని న్యాయస్థానాలు ఆదేశించలేదని, కోర్టు ఆదేశాలను తప్పుగా అర్థం చేసుకోవడం సరికాదని ఆయన స్పష్టం చేశారు.స్థానిక సంస్థల ఎన్నికలు జరగకపోవడం వల్ల సుమారు రూ.20 వేల కోట్ల నిధులు నిలిచిపోయే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రక్రియపై అనవసర వివాదాలు సృష్టించడం, పార్టీ కార్యకర్తలను రెచ్చగొట్టడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని హితవు పలికారు.ప్రజాస్వామ్య వ్యవస్థలపై గౌరవం ఉండాలి. ప్రజల తీర్పును ధైర్యంగా ఎదుర్కోవాలి. ఎన్నికల ప్రక్రియకు ఆటంకాలు కలిగించకుండా, బీసీల హక్కులు మరియు స్థానిక సంస్థల అభివృద్ధికి అన్ని పార్టీలు సహకరించాలని సామకోటి ఆదినారాయణ కోరారు.

# తెలుగు తమ్ముళ్లపై... ఆ ఇద్దరి పోలీసులు దాడి..!,

**చెన్నేకొత్తపల్లిలో టీడీపీ నేతలపై సీఐ, ఎస్ఐ దాడి**

**ఉదయం 7గంటలకే నామినేషన్ కేంద్రాల్లోకి వైసీపీ నేతలకు అనుమతి.**

**హోంగార్డ్ బంధువు నామినేషన్ వేస్తున్న సమయంలో టీడీపీ నేతలపై దాడి**

**ఆందోళనకు సిద్ధమైన టీడీపీ నేతలు.. అక్కడికి చేరుకున్న పరిటాల సునీత, ఎంఎస్ రాజు**

**ఎస్పీతో మాట్లాడిన ఎమ్మెల్యే సునీత, ఎంఎస్ రాజు**

**సీఐ, హోంగార్డులపై చర్యలు తీసుకుంటామని ఎస్పీ హామీ**





చెన్నేకొత్తపల్లి అక్టోబర్ 22 సీమ వార్త సాయంత్రం.

స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో చెన్నేకొత్తపల్లి ఇన్ ఛార్జి సీఐ ఇస్మాయిల్, ఎస్ఐ సత్యనారాయణ అత్యుత్సాహం ప్రదర్శించారు. నామినేషన్ కేంద్రాలకు దూరంగా ఉన్న టీడీపీ నేతలపై విచక్షణారహితంగా లాఠీలతో దాడి చేశారు. అదే సీఐ, ఎస్ఐ ఉదయం 7గంటలకే నామినేషన్ కేంద్రాల్లోకి వైసీపీ నేతలను అనుమతించడంతో పాటు వారితో కరచాలనం చేస్తూ చనువుగా ప్రవర్తించారు. మరోవైపు పుట్టపర్తిలో పని చేస్తున్న న్యామద్దల గ్రామానికి చెందిన హోంగార్డ్ నాగేంద్ర బంధువు నామినేషన్ వేసేందుకు రాగా ఆ సమయంలో టీడీపీ నేతలు అక్కడ ఉండకుండా చెదరగొట్టే ప్రయత్నం చేశారు. వారు తమ పార్టీ నాయకుల నామినేషన్ కు వచ్చామని చెబుతున్నా వినకుండా విచక్షణారహితంగా లాఠీలతో చితకబాదారు. అక్కడున్న యాచకులపై సైతం ఇలానే దాడి చేశారు. దీంతో ఆగ్రహించిన టీడీపీ నేతలు ఆందోళనకు సిద్ధమయ్యారు. విషయం తెలుసుకున్న రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, జిల్లా - మిగతా3లో

# నామినేషన్ల ప్రక్రియలో ఏలాంటి ఇబ్బందులు రాకూడదు..!!

## ....పెద్దపప్పూరులో నామినేషన్ల ప్రక్రియను పరిశీలించిన జిల్లా సంయుక్త కలెక్టర్ సి.విష్ణుచరణ్.

అనంతపురం, అక్టోబర్ 22 సీమ వార్త సాయంత్రం.





స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా జెడ్పిటిసి / ఎంపిటిసి ఎన్నికలు – 2026 కు సంబంధించి పెద్దపప్పూరు మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో గురువారం ఎంపిటిసి నామినేషన్ల ప్రక్రియను జిల్లా సంయుక్త కలెక్టర్ సి.విష్ణుచరణ్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో ఎన్నికల నోటిఫికేషన్ షెడ్యూల్ ప్రకటన, నోటీస్ బోర్డు ఏర్పాటు, సీసీటీవీ కెమెరాల ఏర్పాటు, సెక్యూరిటీ సమస్యలు, తదితర వివరాలను జిల్లా సంయుక్త కలెక్టర్ ఆరా తీశారు.ఈ సందర్భంగా జిల్లా సంయుక్త కలెక్టర్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా ఎంపిటిసి నామినేషన్ల ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. అభ్యర్థులకు కుల ధృవీకరణ పత్రాలు, ఆదాయ ధృవీకరణ పత్రాలను సమయానికి ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నామినేషన్ల ప్రక్రియకు సంబంధించి ఎలాంటి భద్రత సమస్యలు రాకుండా చూడాలన్నారు. నామినేషన్ల చివరి రోజు చివరి సమయంలో ఇబ్బందులు రాకుండా పటిష్ట జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఏమైనా సమస్యలు ఉన్నాయా అంటూ ఆర్ఓ, పోలీసులను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సుయాష్ కుమార్, ఎంపీడీవో పెద్దపప్పూరు, డిఎం మార్క్వెడ్ మరియు ఎన్నికల అధికారి పెన్నేశ్వరి, తహసీల్దార్ బాలాజీ రాజు, ఎన్నికల సిబ్బంది, పోలీసులు

## నామినేషన్ ప్రక్రియలో గట్టి పోలీసు బందోబస్తు

.... పర్యవేక్షించిన ఎస్పి గోపాలకృష్ణ



అమడగూరు అక్టోబర్ 22 సీమ వార్త సాయంత్రం.


అమడగూరు మండలంలో ఎలాంటి అవంచ్చినియ సంఘటనలకు దారి తీయకుండా నామినేషన్ ప్రక్రియను చాలా కట్టుదిట్టంగా నామినేషన్ వేయడానికి వస్తున్నటువంటి అభ్యర్థులు 100 మీటర్ల దూరం నుంచి కేవలం ముగ్గురిని మాత్రమే లోపలికి పంపడం జరుగుతుంది . ఈ విషయాన్ని అన్ని రాజకీయ పార్టీలు మరియు ఇండిపెండెంట్ అభ్యర్థులు వీటిని తూచా తప్పకుండా పాటించవలసిందిగా ఎస్పి గోపాలకృష్ణ తెలిపారు

## మార్నింగ్ వాక్‌లో.....
# సిక్స్ కొట్టిన సవిత..!!

## ....పెనుకొండలో మంత్రి సవితమ్మ మార్నింగ్ వాక్.

## ....ప్రజలతో కలిసి వాకింగ్.. మైదానంలో క్రికెట్ ఆడిన మంత్రి

## ....టీ స్టాల్‌లో సామాన్యులతో మంత్రి సవితమ్మ









పెనుకొండ అక్టోబర్ 22 సీమ వార్త సాయంత్రం.

రాష్ట్ర మంత్రి సవితమ్మ పెనుకొండ పట్టణంలో మార్నింగ్ వాక్ నిర్వహించారు. పెనుకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో పాదచారులతో కలిసి వాకింగ్ చేస్తూ వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మైదానంలో క్రికెట్ ఆడి సందడి చేశారు. అనంతరం పెనుకొండ ఆర్టీసీ బస్టాండ్, అంబేద్కర్ సర్కిల్ వద్ద ఉన్న టీ స్టాళ్లలో సామాన్య ప్రజలతో కలిసి టీ తాగుతూ ఆత్మీయంగా ముచ్చటించారు. ప్రజలతో సరదాగా మాట్లాడుతూ వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో పెనుకొండ మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి త్రివేంద్ర నాయుడు, వార్డు కౌన్సిలర్ అభ్యర్థులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీమ వార్త సాయంకాలం
గురువారం 22
అక్టోబర్ 2026

## ఏపీకి మరో తుపాను ముప్పు?

బంగాళాఖాతంలో మరో తుపాను భయం నెలకొంది. ఈశాన్య రుతుపవనాల సమయంలో ఏర్పడే వాతావరణ మార్పులు, ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంత ప్రజలను మరోసారి ఆందోళనకు గురిచేస్తున్నాయి. అండమాన్ సముద్రంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం క్రమంగా బలపడి, అల్పపీడనంగా మారి తుపానుగా రూపాంతరం చెందే సూచనలు కనిపిస్తున్నాయని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ వ్యవస్థ ఆంధ్రప్రదేశ్ తీరం వైపుగా పయనించే అవకాశాలు ఉండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. వివరాల్లోకి వెళితే, అక్టోబర్ 22 ఉదయం 5:30 గంటల సమయంలో ఉత్తర అండమాన్ సముద్రం పరిసరాల్లో ఉపరితల ఆవర్తనం ఏర్పడినట్లు వాతావరణ నిపుణులు గుర్తించారు. ఈ ఆవర్తనం ప్రభావంతో అక్టోబర్ 23 నాటికి ఆగ్నేయ, తూర్పు మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని స్పష్టం చేశారు. ఈ వ్యవస్థ పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ రానున్న రోజుల్లో మరింత బలపడనుందని అంచనా వేస్తున్నారు.

**తుపానుగా మారే అవకాశాలు ఎంత?**

సాధారణంగా అక్టోబర్ నుంచి డిసెంబర్ మధ్య కాలాన్ని పోస్ట్-మాన్‌సూన్ సీజన్‌గా పరిగణిస్తారు. ఈ సమయంలో బంగాళాఖాతంలో అల్పపీడనాలు ఏర్పడటం సాధారణమే. సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు వెచ్చగా ఉండటం, వాతావరణంలో తగినంత తేమ ఉండటం వంటి అనుకూల పరిస్థితులు ఉంటే, ఈ అల్పపీడనాలు త్వరితగతిన వాయుగుండంగా, ఆపై తీవ్ర వాయుగుండంగా మారి తుపానుగా రూపాంతరం చెందుతాయి. ప్రస్తుతం బంగాళాఖాతంలో అలాంటి అనుకూల పరిస్థితులే ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. అయితే, అల్పపీడనం ఏర్పడినంత మాత్రాన, ప్రతిసారీ అది తుపానుగా మారుతుందని చెప్పలేమని, దాని తీవ్రత, కదలికలను నిరంతరం గమనించాల్సి ఉంటుందని వారు విశ్లేషిస్తున్నారు.

**ఆంధ్రప్రదేశ్‌పై ప్రభావం**

ప్రస్తుత అంచనాల ప్రకారం, ఈ వ్యవస్థ పశ్చిమ వాయవ్య దిశగా కదులుతోంది. ఈ మార్గంలో ప్రయాణిస్తే అది ఆంధ్రప్రదేశ్ లేదా ఒడిశా తీరాల వైపునకు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఒకవేళ ఈ వ్యవస్థ తుపానుగా మారితే, దాని ప్రభావం ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతాలపై స్పష్టంగా కనిపించవచ్చు. ముఖ్యంగా కోస్తాంధ్ర జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు, గంటకు 100 కిలోమీటర్ల పైబడిన వేగంతో బలమైన గాలులు, సముద్రంలో అలల తీవ్రత పెరగడం వంటి పరిణామాలు సంభవించవచ్చు. ప్రస్తుతానికి తుపాను ఎక్కడ తీరం దాటుతుందనే దానిపై స్పష్టత లేనప్పటికీ, వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో తీరప్రాంత ప్రజలు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. సముద్రంలోకి వేటకు వెళ్లవద్దని, అధికారిక ప్రకటనలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని కోరుతున్నారు.

## ప్రకృతితో ఘర్షణ వద్దు.. విపత్తులను తప్పించలేం

ప్రకృతితో సామరస్యంగా జీవించడం అత్యంత ఆవశ్యకమని, ప్రకృతి వైపరీత్యాలను నివారించడం సాధ్యం కాదని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు స్పష్టం చేశారు. గురువారం హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన 'అలయ్ బలయ్' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆయన గుర్తుచేశారు. రాజకీయాలకు అతీతంగా ప్రజల మధ్య ఐక్యతను, సౌభ్రాతృత్వాన్ని పెంపొందించే గొప్ప వేదిక 'అలయ్ బలయ్' అని ఆయన కొనియాడారు. ప్రతి సంవత్సరం దసరా పండుగ అనంతరం హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ సారథ్యంలో ఈ సాంస్కృతిక సమ్మేళనం జరుగుతోంది. ఈ వేడుకలో బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్, సీపీఐ, సీపీఎం సహా పలు రాజకీయ పార్టీల నేతలు పాల్గొని సమైక్యతను చాటారు. తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, పంజాబ్ గవర్నర్ గులాబ్ చంద్ కటారియా, కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ, లౌకిక దేశంలో ఏ మతాన్ని, పండుగను తక్కువ చేసి చూడకూడదని పేర్కొన్నారు. 'వికసిత్ భారత్' సాధనను దేశ ప్రజలందరూ తమ ఉమ్మడి జాతీయ లక్ష్యంగా మలుచుకోవాలని బండారు దత్తాత్రేయ పిలుపునిచ్చారు. కులమతాలకు, రాజకీయాలకు, ప్రాంతీయ భేదాలకు అతీతంగా ఈ కార్యక్రమం నిలుస్తుందని అలయ్ బలయ్ ఫౌండేషన్ ఛైర్‌పర్సన్, దత్తాత్రేయ కుమార్తె బండారు విజయలక్ష్మి తెలిపారు. 'నషా ముక్త్ భారత్ - వికసిత్ భారత్' (మత్తుపదార్థాల రహిత - అభివృద్ధి చెందిన భారతదేశం) అనే ఇతివృత్తంతో ఈ ఏడాది అలయ్ బలయ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేడుకలో తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించే జానపద కళారూపాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచి ఆహూతులను అలరించాయి.

## పవన్ కల్యాణ్ రాజీనామా అంటూ వాట్సాప్‌లో తప్పుడు ప్రచారం

-మొదటిపేజీ తరువాయి

అంతకుముందు, పవన్ రాజీనామా చేస్తున్నారంటూ జరుగుతున్న ప్రచారంపై డిప్యూటీ సీఎం కార్యాలయం తీవ్రంగా స్పందించింది. "డిప్యూటీ సీఎంఓ, ఆంధ్రప్రదేశ్" పేరుతో నడుస్తున్న ఫేక్ వాట్సాప్ ఛానెల్‌పై, ఇతర తప్పుడు ప్రచారాలపై సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసి, ఎఫ్ఐఆర్ నమోదు చేయిస్తున్నట్లు ప్రకటించింది. ప్రభుత్వ కార్యాలయం పేరును దుర్వినియోగం చేస్తూ తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. ఈ అధికారిక హెచ్చరికల నేపథ్యంలోనే వాట్సాప్ అడ్మిన్ క్షమాపణ చెప్పినట్లు స్పష్టమవుతోంది.

## తిరుమలలో తగ్గిన భక్తుల రద్దీ..

కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి కొలువై ఉన్న తిరుమల క్షేత్రంలో భక్తుల రద్దీ గణనీయంగా తగ్గింది. గత కొన్ని రోజులుగా కొనసాగిన రద్దీకి భిన్నంగా, ప్రస్తుతం కొండపై ప్రశాంత వాతావరణం నెలకొంది. దీంతో భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాఫీగా శ్రీవారిని దర్శించుకుంటున్నారు. గురువారం ఉదయం నాటికి భక్తులు కేవలం 12 కంపార్ట్‌మెంట్లలో మాత్రమే శ్రీవారి దర్శనం కోసం వేచి ఉన్నారు. సాధారణంగా వారాంతాల్లో, పర్వదినాల్లో కంపార్ట్‌మెంట్లు అన్నీ నిండిపోయి, వెలుపల కిలోమీటర్ల మేర క్యూలైన్లు కనిపిస్తాయి. అయితే, ప్రస్తుతం రద్దీ తక్కువగా ఉండటంతో భక్తులకు నిరీక్షణ సమయం బాగా తగ్గింది. టైమ్‌స్లాట్ టోకెన్లు లేని భక్తులకు సర్వదర్శనానికి సుమారు 6 గంటల సమయం పడుతోందని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు వెల్లడించారు. ఇక బుధవారం (అక్టోబర్ 21) నాడు శ్రీవారిని దర్శించుకున్న భక్తుల వివరాలను టీటీడీ విడుదల చేసింది. నిన్న ఒక్కరోజే 73,226 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. 24,754 మంది తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు హుండీలో సమర్పించిన కానుకల ద్వారా రూ. 2.66 కోట్ల ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు. అదేవిధంగా, నిన్న ఒక్కరోజే 3.63 లక్షల లడ్డూలను విక్రయించగా, 1.58 లక్షల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. తిరుమలలోని అశ్విని ఆసుపత్రిలో 2,217 మందికి వైద్య సేవలు అందించినట్లు టీటీడీ పేర్కొంది.

## బీసీ కులగణనలో తప్పులుంటే సరిచేస్తాం..

-మొదటిపేజీ తరువాయి

నమోదైందని భావిస్తే సంబంధిత వివరాలు అందించాలని సూచించారు. వచ్చే కేబినెట్ సమావేశంలో ఈ అంశంపై చర్చించి లెక్కలను మరింత పక్కాగా చేస్తామని వెల్లడించారు. తనకు అవకాశం ఉంటే తన కుర్చీ చుట్టూ బలహీనవర్గాలను కూర్చోబెట్టుకోవాలన్నదే తన ఆలోచన అని రేవంత్ రెడ్డి అన్నారు. ముదిరాజ్‌లను ప్రస్తుతం బీసీ-డీ జాబితా నుంచి బీసీ-ఏలోకి మార్చాలన్న డిమాండ్‌పైనా సీఎం స్పందించారు. ఈ అంశంపై ముదిరాజ్ నాయకులు న్యాయ నిపుణులను సంప్రదించి, ఉన్న అవకాశాలను పరిశీలించాలని సూచించారు. గంగపుత్రుల్లో ఉన్న అపోహలను కూడా తెలుసుకోవాలని అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముదిరాజ్ సామాజికవర్గానికి చెందిన పలువురికి పదవులు కల్పించామని, మిగిలిన నాయకులకు కూడా త్వరలో అవకాశాలు వస్తాయని హామీ ఇచ్చారు. తన పనితీరుపై మాట్లాడుతూ పరోక్షంగా గత సీఎం కేసీఆర్‌ను ఉద్దేశించి విమర్శలు చేశారు. తనకు ఇంకా వయసు, ఓపిక ఉన్నాయని, తాను ఫామ్‌హౌస్‌లో పడుకునే రకాన్ని కాదని వ్యాఖ్యానించారు. పండుగ సాయన్న జయంతి, వర్ధంతి వేడుకలను అధికారికంగా నిర్వహిస్తామని సీఎం ప్రకటించారు. పండుగ సాయన్న కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. దొడ్డి కొమురయ్య, పండుగ సాయన్న విగ్రహాలను ట్యాంక్‌బండ్ సమీపంలో ఏర్పాటు చేస్తామని తెలిపారు. బలహీనవర్గాలకు సామాజిక న్యాయం, సమాన అవకాశాలు కల్పించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

## అందుకే కేటీఆర్ గడ్డం పెంచుతున్నారట..

తెలంగాణలో బీజేపీ మౌనంగా ఉందన్న ప్రచారాన్ని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ తోసిపుచ్చారు. 2028 అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో కాషాయ సునామీ ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ గెలుపు కోసం తెరవెనుక పనులు జరుగుతున్నాయని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో ఏ పార్టీతోనూ పొత్తు లేకుండానే విజయం సాధిస్తామని అన్నారు. గురువారం నిజామాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు పరస్పరం కాపాడుకుంటున్నారని అర్వింద్ ఆరోపించారు. రాష్ట్రంలో ఈ రెండు పార్టీల మధ్య పొత్తు చర్చలు జరుగుతున్నాయని అన్నారు. కాంగ్రెస్ హైకమాండ్ సీఎం రేవంత్‌రెడ్డిపై అసంతృప్తితో ఉందని, బీఆర్ఎస్‌తో పొత్తు ద్వారా ఆయనను పదవి నుంచి తప్పించే ఆలోచనలో ఉందని వ్యాఖ్యానించారు. కాళేశ్వరం ప్రాజెక్టు బీఆర్ఎస్ పాలనలో అవినీతికి వేదికగా మారిందని అర్వింద్ విమర్శించారు. గతంలో లక్షల కోట్లు దోచుకున్నారంటూ ఆరోపణలు ఎదుర్కొన్న బీఆర్ఎస్‌కు ప్రజలు మళ్లీ ఎందుకు ఓటేస్తారని ప్రశ్నించారు. సోషల్ మీడియాలో పెయిడ్ ప్రచారాలు చేయించుకుంటూ ఆ పార్టీ గొప్పలు చెప్పుకుంటోందని విమర్శించారు. త్వరలో పత్రికలు, టీవీ ఛానళ్లు, సోషల్ మీడియా వేదికలపై బీజేపీ మరింత దూకుడుగా వ్యవహరిస్తుందని చెప్పారు. తమ ప్రశ్నలకు బీఆర్ఎస్ సమాధానం చెప్పాల్సి వస్తుందని అన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ కనుమరుగవుతుందని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్‌ను ఎవరూ ఓడించాల్సిన అవసరం లేదని, ఆ పార్టీనే కనుమరుగవుతుందని ఎద్దేవా చేశారు.

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గడ్డం పెంచడంపైనా అర్వింద్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. గడ్డం పెంచుకుంటే ముఖ్యమంత్రి అవుతారని ఎవరో చెప్పడంతోనే కేటీఆర్ అలా చేస్తున్నారేమోనని సెటైర్ వేశారు.

గతంలో కేసీఆర్ పాత సచివాలయానికి వెళ్తే ఓడిపోతారని ఎవరో చెప్పడంతో కొత్త సచివాలయం నిర్మించారని, అయినా ఎన్నికల్లో గెలవలేకపోయారని అన్నారు. ముఖ్యమంత్రి కావాలనే ఆశతో గడ్డం పెంచుకోవడం కేటీఆర్‌తోనే మొదలుకాలేదని, గతంలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కూడా గడ్డం పెంచారని గుర్తుచేశారు. ఆయన గడ్డం పెరిగిందే తప్ప కాంగ్రెస్ పార్టీ బలపడలేదని వ్యాఖ్యానించారు. కేటీఆర్ గడ్డం పెరుగుతుందేమో కానీ సీఎం మాత్రం కాలేరంటూ అర్వింద్ ఎద్దేవా చేశారు.

## ఎంత వరకైనా పోరాడదాం

వైసీపీ అధినేత జగన్ పార్టీ ముఖ్య నేతలతో సమావేశమయ్యారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా జరుగుతున్న హింస, అక్రమాలపై సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల నేపథ్యంలో ఈ భేటీ జరిగింది. చంద్రబాబు ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా హింసకు పాల్పడుతోందని ఆరోపించిన జగన్, ప్రజాస్వామ్య పరిరక్షణకు న్యాయపోరాటం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

"చంద్రబాబు వ్యవస్థీకృతంగా, ఉద్దేశపూర్వకంగా హింసకు పాల్పడుతున్నారు. ప్రభుత్వాన్ని నడుపుతున్నవారే హింసకు పాల్పడటం ఎక్కడా చూసి ఉండం. పోలీసులను వాడుకుని ఈ దారుణాలన్నీ చంద్రబాబు చేయిస్తున్నారు" అని తీవ్ర స్థాయిలో విమర్శించారు. సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చినా క్షేత్రస్థాయిలో పరిస్థితి మారలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

క్షేత్రస్థాయిలో వైసీపీ కార్యకర్తలు, నాయకులు ధైర్యం ప్రదర్శిస్తున్నారని జగన్ ప్రశంసించారు. "క్షేత్రస్థాయిలో జరుగుతున్న ఘటనలపై ఆధారాల సేకరణ చాలా అవసరం. పటిష్ఠ ఆధారాలను కోర్టుల ముందు ఉంచడం ద్వారా న్యాయపోరాటం చేద్దాం. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఎందాకైనా పోరాటం చేద్దాం" అని జగన్ పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేశారు.

## వైసీపీ ఎత్తుగడలను తిప్పికొట్టేందుకు ఉమ్మడి కార్యాచరణ

-మొదటిపేజీ తరువాయి

సమయం ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని రాష్ట్ర ఎన్నికల సంఘానికి (ఎస్ఈసీ) సుప్రీంకోర్టు సూచించడమే ఈ ఆకస్మిక సమావేశానికి ప్రధాన కారణం. ఈ ఆదేశాల నేపథ్యంలో రాష్ట్రంలో 19 మున్సిపాలిటీలతో పాటు జరగబోయే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల ప్రక్రియపై ఎలాంటి ప్రభావం పడుతుందనే అంశంపై చంద్రబాబు, పవన్ లోతుగా చర్చించారు. న్యాయస్థానం ఆదేశాలను అమలు చేస్తూనే, ఈ పరిణామాన్ని అవకాశంగా తీసుకుని వైసీపీ చేసే రాజకీయ ప్రచారాన్ని ఎలా తిప్పికొట్టాలనే దానిపై ఇరువురు నేతలు సుదీర్ఘంగా మంతనాలు జరిపినట్లు తెలుస్తోంది. ఈ భేటీలో ముఖ్యంగా పరిషత్ ఎన్నికలే ప్రధాన అజెండాగా నిలిచాయి. ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల్లో టీడీపీ - జనసేన - బీజేపీ కూటమి అభ్యర్థుల మధ్య సీట్ల సర్దుబాటు, నామినేషన్ల ప్రక్రియలో అనుసరించాల్సిన వ్యూహాలపై వారు ఒక అవగాహనకు వచ్చారు. గతంలో మున్సిపల్ ఎన్నికల సమయంలో వైసీపీ సృష్టించిన నాటకీయ పరిణామాలను దృష్టిలో ఉంచుకుని, ఈసారి అలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పక్కా ప్రణాళికతో నామినేషన్ల ఘట్టాన్ని పూర్తి చేయాలని నిర్ణయించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించి, గ్రామ స్థాయిలో కూటమి ఓటు బ్యాంకును పటిష్ఠం చేసుకుంటూ మెజారిటీ స్థానాలను కైవసం చేసుకోవడమే లక్ష్యంగా ఉమ్మడి కార్యాచరణను ఖరారు చేశారు. డిప్యూటీ సీఎం హోదాలో ఉన్నప్పటికీ పవన్ కళ్యాణ్ కేవలం పార్టీ పనుల కోసమే ప్రొటోకాల్‌ను పక్కనపెట్టి వచ్చారని జనసేన వర్గాలు చెబుతున్నాయి. క్లిష్టమైన రాజకీయ పరిస్థితుల్లో అధికారిక హంగుల కన్నా, పక్కా వ్యూహంతో ముందుకు సాగడమే ముఖ్యమనే బలమైన సందేశాన్ని ఈ చర్య ద్వారా పవన్ తన శ్రేణులకు పంపించారు. ఈ భేటీ ద్వారా పరిషత్ ఎన్నికల్లో వైసీపీ ఎత్తుగడలను సమర్థంగా ఎదుర్కొనేందుకు కూటమి సిద్ధంగా ఉందని చంద్రబాబు, పవన్ స్పష్టం చేశారు. రానున్న 48 గంటల్లో ఎస్ఈసీ తీసుకునే నిర్ణయం, తదుపరి పరిణామాలు రాష్ట్ర రాజకీయాల్లో కీలకం కానున్నాయి.

## బతుకమ్మ పూల చెత్తతో సిరుల పంట..

-మొదటిపేజీ తరువాయి



వరంగల్, హనుమకొండ, కాజీపేట ట్రైసిటీస్ పరిధిలో తొమ్మిది రోజుల పాటు జరిగిన బతుకమ్మ ఉత్సవాల్లో బంతి, చామంతి, గునుగు, తంగేడు, సీతజడ, గుమ్మడి, గులాబీ తదితర రకాల పూలు దాదాపు 60 టన్నుల మేర వినియోగించినట్లు అధికారులు గుర్తించారు. ఎనిమిది రోజుల పాటు మైదానాల్లో ఆడి పడేసిన పువ్వులతో పాటు, సద్దుల బతుకమ్మ నాడు చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేసిన పూలను శానిటేషన్ సిబ్బంది ఎప్పటికప్పుడు సేకరించారు. ఇప్పటివరకు దాదాపు 40 టన్నుల పూల వ్యర్థాలను ఒడ్డుకు చేర్చి ప్రాసెసింగ్ కేంద్రాలకు తరలించారు. బతుకమ్మ పూలతో పాటు నగరంలోని ఆలయాలు, పూల మార్కెట్ల నుంచి వచ్చే వ్యర్థాలను కూడా వీటికి జత చేస్తున్నారు.

మూడు దశల్లో సేంద్రియ ఎరువు తయారీ

సేకరించిన పూల వ్యర్థాలను వరంగల్ నగరంలోని 6 ప్రత్యేక కేంద్రాల్లో ప్రాసెస్ చేస్తున్నారు.

వ్యర్థాల వేరుచేత: మొదటగా పూలలో కలిసిపోయిన ప్లాస్టిక్ కవర్లు, దారాలు, రిబ్బన్లు, ఇతర వ్యర్థాలను వేరు చేస్తున్నారు.

కంపోస్టింగ్ ప్రక్రియ: పూర్తిగా శుద్ధి చేసిన పూలను గుంతలు, తొట్టెల్లో నింపి శాస్త్రీయ పద్ధతిలో బయో కంపోస్ట్‌గా మారుస్తున్నారు.

ఎరువుగా మార్పు: నిర్దిష్ట గడువులో సేంద్రియ పోషకాలు సమృద్ధిగా ఉండే పచ్చి ఎరువు సిద్ధమవుతోంది.

మొక్కల పెంపకానికి.. రైతులకు వరం

ఈ విధంగా తయారైన బయో కంపోస్ట్‌ను గ్రేటర్ వరంగల్ పరిధిలోని అర్బన్ ప్లాంటేషన్, పార్కులు, డివైడర్లపై ఉన్న మొక్కలకు ఎరువుగా వాడుతున్నారు. రసాయన రహిత సాగు వైపు మొగ్గు చూపే రైతులకు, నగర పౌరులకు కూడా నామమాత్రపు ధరకే లేదా ఉచితంగా ఈ ఎరువును సరఫరా చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. పుడమి నుంచి పుట్టిన పువ్వులను పూజలకే కాకుండా.. మళ్లీ భూమాతకు బలాన్నిచ్చే సేంద్రియ ఎరువుగా మార్చడం పట్ల వరంగల్ ప్రజలు, పర్యావరణ వేత్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వ్యర్థాల నిర్వహణలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ యంత్రాంగం చూపిన చొరవ ఇతర నగరాలకు ఆదర్శంగా నిలుస్తోంది.

## తెలుగు తమ్ముళ్లపై... ఆ ఇద్దరి పోలీసులు దాడి..!,



-మొదటిపేజీ తరువాయి

టీడీపీ అధ్యక్షుడు ఎంఎస్ రాజు అక్కడికి చేరుకున్నారు. టీడీపీ నేతలతో మాట్లాడగా.. సీఐ, ఎస్ఐ వ్యవహించిన తీరు గురించి వివరించారు. దీంతో ఎమ్మెల్యే సునీత నేరుగా జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఫోన్ చేశారు. తమ పార్టీ నాయకులు ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు ఇవ్వకుండా ప్రశాంతంగా ఉన్న చోట ఇలా సీఐ, ఎస్ఐ దాడి చేశారని ఫిర్యాదు చేశారు. ఎస్పీ సతీష్ కుమార్ దీనిపై స్పందిస్తూ.. సీఐ, హోంగార్డుల మీద చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో టీడీపీ నేతలు శాంతించారు. వైసీపీ నాయకులు నామినేషన్ వేయడంలో తమకు ఎలాంటి ఇబ్బంది లేదని.. స్వేచ్ఛగా వేసుకోవచ్చని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. కానీ ప్రశాంతంగా ఉన్న చోట టీడీపీ నేతలపై పోలీసులు వారి స్వప్రయోజనాల కోసం దాడులు చేయడం ఏంటని నిలదీశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం అయితే.. ఎన్నికల కమిషన్ కు కూడా ఫిర్యాదు చేస్తామని ఆమె స్పష్టం చేశారు.

## పుట్టినరోజు సందర్భంగా అగాపే ఆశ్రమంలో అన్నదానం



**యాడికి అక్టోబర్ 22 సీమ వార్త సాయంకాలం** యాడికి మండలకేంద్ర లోని కమలపాడు రోడ్డు రాఘవేంద్ర కాలనీలో ఉన్న అగాపే ఆశ్రమంలో సురభి వెంకటేష్ భార్య అపర్ణ వీరి కుమారుడు సురభి అయాన్స్ 5 వపుట్టినరోజు శుభ సందర్భంగా వారి కుమారునికి ఆశ్రమంలోని పెద్దల ఆశీస్సులు తీసుకొని భోజనాలు ఏర్పాటు చేయించి ఆశ్రమంలోని వృద్ధులకు నిరాశ్రయులకు అన్నదానం చేశారు. ఆశ్రమ ఫౌండర్ బత్తల ప్రసాద్ ఆశ్రమంలోని వారు వారి కుమారునికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసి రెండు చేతులెత్తి ఇలాగ ఇంకా ఎన్నో పుట్టిన రోజులు జరుపుకోవాలని కోరుకుంటూ ఆ కుమారుని దీవించి వారి కుటుంబానికి కృతజ్ఞతలు తెలిపారు.

## చిలమత్తూర్ జెడ్పీటీసీ అభ్యర్థిగా టీడీపీ తరఫున రంగారెడ్డి నామినేషన్

**బాలకృష్ణ ఆదేశాలతో నామినేషన్ దాఖలు..**
**కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు**



**చిలమత్తూర్ అక్టోబర్ 22 సీమ వార్త సాయంకాలం :** హిందూపురం శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణ ఆదేశాల మేరకు చిలమత్తూర్ జెడ్పీటీసీ అభ్యర్థిగా తెలుగుదేశం పార్టీ తరఫున రంగారెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. హిందూపురం ఎమ్మెల్యే పీఏ సురేంద్ర సమక్షంలో ఈ నామినేషన్ కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ తరఫున అభ్యర్థి నామినేషన్ దాఖలు చేయడంతో పార్టీ శ్రేణుల్లో రాజకీయ సందడి నెలకొంది. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ బేకరి గంగాధర్,టీడీపీ సీనియర్ నాయకుడు దేమకేతే పల్లి అంజినప్ప, పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై అభ్యర్థికి మద్దతు తెలిపారు. చిలమత్తూరు మండలంలో పార్టీ బలోపేతానికి, స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయానికి సమష్టిగా కృషి చేయాలని పార్టీ శ్రేణులు ఆకాంక్షించారు.

## వెంకటాపురం ఎంపీటీసీ స్వతంత్ర అభ్యర్థిగా జే. అక్కులమ్మ

**ఓబులదేవరచెరువు (అక్టోబర్23)**
**సీమవార్త:సాయంత్రం.**



ఓడి చెరువు మండలం వెంకటాపురం ఎంపీటీసీ స్వతంత్ర అభ్యర్థిగా జే. అక్కులమ్మ నామినేషన్ వేశారు.గురువారం నామినేషన్ ల కార్యాలయానికి వచ్చి వారు నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారికి సమర్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...తెలుగుదేశం పార్టీలో సుదీర్ఘకాలంగా ఉంటూ పార్టీ అభివృద్ధికి కష్టపడి పని చేసినా ఫలితం లేదన్నారు. టిడిపి తరఫున ఎంపీటీసీ స్థానానికి టికెట్ ఆశించిన దక్కలేదన్నారు. అందుకని స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేసినట్లు ఈ సందర్భంగా తెలిపారు. వెంకటాపురం పరిధిలో విశేష ఆదరణ కలిగి ఉన్నానని ప్రస్తుత ఎంపీటీసీ ఎన్నికలలో ప్రత్యర్థి ఎవరైనా గెలిచి తీరుతాననే ధీమాను అక్కులమ్మ వ్యక్తం చేశారు.

# రాజకీయ విమర్శలకు హద్దులు ఉండాలి..

## రాచమల్లుకు కొండారెడ్డి సూచన

ప్రొద్దుటూరు, అక్టోబర్ 22, (సీమవార్త , సాయంకాలం): రాజకీయ విమర్శలు చేసేటప్పుడు సంయమనం పాటించాలని టీడీపీ నాయకుడు నంద్యాల కొండారెడ్డి మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డికి సూచించారు. గురువారం స్థానిక ఎస్.కె.ఎస్.సి డిగ్రీ కళాశాలలో ఆయన ప్రెస్ మీట్ లో మాట్లాడుతూ ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికల్లో పోటీ చేసి ప్రజల మద్దతుతో గెలవాలని, వ్యక్తిగత విమర్శలు, అభ్యంతరకర వ్యాఖ్యలకు దూరంగా ఉండాలని హితవు పలికారు. ప్రొద్దుటూరులో ప్రశాంత వాతావరణం కొనసాగడమే తమ అభిమతమని స్పష్టం చేశారు. గత ఎన్నికల్లో టీడీపీకి 23 ఎమ్మెల్యే స్థానాలు వచ్చాయని విమర్శించిన రాచమల్లు, ఆ తర్వాత వైసీపీకి 11 స్థానాలే వచ్చాయనే విషయాన్ని గుర్తుంచుకోవాలని కొండారెడ్డి అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజల మద్దతు లభించకపోవడంతో అసహనంతో వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. గత ఎన్నికల సమయంలో పోలీసుల సహాయంతో ప్రత్యర్థి అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా అడ్డుకున్నారని విమర్శించారు. రాచమల్లు తన భార్య రమాదేవితో నామినేషన్ ఉపసంహరింపజేయడంపై ప్రశ్నిస్తూ, సొంత కుటుంబ సభ్యుల విషయంలో ఒక విధంగా, పార్టీ నాయకుల విషయంలో మరో విధంగా వ్యవహరించడం ఏమిటని నిలదీశారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికల్లో పోటీ చేసి గెలవాలని, అధికారంలోకి వచ్చిన తర్వాత నంద్యాల రాఘవరెడ్డితో రాజీనామా చేయించాలని సవాల్ విసిరారు.



గెలిచిన వారిని సమాధి చేస్తామంటూ బెదిరింపు ధోరణిలో మాట్లాడటం సరికాదని, ఇటువంటి వ్యాఖ్యలు చట్టపరమైన పరిణామాలకు దారితీయవచ్చని హెచ్చరించారు. టీడీపీ ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించడం, నాణ్యమైన విద్య, వైద్య సేవలు అందించడం లక్ష్యంగా ముందుకు సాగుతోందని కొండారెడ్డి తెలిపారు. రాజకీయంగా విభేదాలు ఉన్నప్పటికీ ప్రజాశాంతికి విఘాతం కలగకుండా నాయకులు బాధ్యతాయుతంగా మాట్లాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు చల్లా రాజగోపాల్ యాదవ్, టీడీపీ నాయకులు వంగనూరు మురళీధర్ రెడ్డి, నల్లబోతుల నాగరాజు, సీతంపల్లె చంద్ర, కుతుబుద్దీన్, తలారి పుల్లయ్య, బొమ్మిరెడ్డి ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ కార్మికులు నిరసన



**మడకశిర అక్టోబర్ 22 సీమ వార్త సాయంకాలం** రాష్ట్ర ఏపీ పీటీడీ జేఏసీ ఆధ్వర్యంలో విద్యుత్ బస్సులను ఆర్టీసీ సంస్థ వారే కొనుగోలు చేసి ఆర్టీసీ డ్రైవర్ కండక్టర్లతో నడపాలని , స్త్రీశక్తి పథకాన్ని మెరుగైన స్థాయిలో సేవలు అందించాలంటే కాలం చెల్లిన బస్సు స్థానంలో నూతన బస్సులను కొనుగోలు చేయాలి. ఉద్యోగ నియమకాలను చేపట్టాలి, ప్రమోషన్లను వెంటనే అమలు పరచాలని డిమాండ్లతో నల్ల బ్యాడ్జీలతో గురువారం నిరసనలు వ్యక్తం చేయాలని పిలుపునిచ్చారు. వారి పిలుపుమేరకు మడకశిర డిపో లో పీటీడీ ఉద్యోగులు ఉదయం 5 గంటల నుండి నల్ల బ్యాడ్జీలు ధరించి తమ తమ విధులకు హాజరయ్యారు. ఏపీపీటీడీ జేఏసీ నాయకులు జి. ఎండీ. రఫీక్, డిపో అధ్యక్షులు , పి. రంగనాథ్ డిపో కార్యదర్శి, ఎన్ఎంయు అధ్యక్షులు ముద్దప్ప , ఈ యూ నాయకులు బి.ఈశ్వరప్ప, జి. దాసప్ప, మంజు, రాధమ్మ, సుదర్శన్, మల్లికార్జున పాల్గొన్నారు.

## మడకశిర నగర పంచాయతీ

## ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల ప్రచారం జోరు

**జనసేన మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి గుండుమల శారదమ్మ వార్డు కౌన్సిలర్ల ప్రచార కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పే స్వామి**





**మడకశిర అక్టోబర్ 22 సీమ వార్త** పట్టణంలోని శివాపురం శ్రీ చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, పూజల అనంతరం శివాపురం నుండి అంబేద్కర్ సర్కిల్ వరకు మున్సిపల్ ఎన్నికల ప్రచార కార్యక్రమం అత్యంత ఉత్సాహంగా సాగింది. కూటమి అభ్యర్థుల భారీ గెలుపే లక్ష్యంగా నాయకులు పెద్ద ఎత్తున ఈ ప్రచారంలో పాల్గొని ప్రజల మద్దతు కోరారు. పట్టణాభివృద్ధే ధ్యేయంగా కూటమి అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ ప్రచార కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి , మడకశిర అబ్జర్వర్ సుధాకర్ , జనసేన మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి గుండుమల శారదమ్మ రాధాకృష్ణ , 23 వార్డు కౌన్సిలర్ అభ్యర్థులు మాజీ కౌన్సిలర్లు మాజీ మున్సిపల్ చైర్మన్లు టీడీపీ సీనియర్ నాయకులు జనసేన – బీజేపీ – టీడీపీ కూటమి నాయకులు, కన్వీనర్లు, క్లస్టర్ ఇంచార్జులు, అనుబంధ కమిటీల నాయకులు మరియు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## లేపాక్షి వీరభద్రస్వామిని దర్శించుకున్న జార్ఖండ్ హైకోర్టు న్యాయమూర్తి



**లేపాక్షి అక్టోబర్ 22 సీమ వార్త సాయంకాలం:** ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన శ్రీ సత్యసాయి జిల్లా లేపాక్షిలోని శ్రీ వీరభద్రస్వామి దేవాలయాన్ని జార్ఖండ్ హైకోర్టు, రాంచీ న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ ప్రసాద్ తన సతీమణి, కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం శ్రీ వీరభద్రస్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు అందజేశారు. దేవాదాయ శాఖ తరపున ఆలయ సంప్రదాయాల ప్రకారం న్యాయమూర్తి, ఆయన కుటుంబ సభ్యులకు సకల మర్యాదలు నిర్వహించి సత్కరించారు. చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాశస్త్యం కలిగిన లేపాక్షి ఆలయాన్ని సందర్శించడం పట్ల కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ ప్రమీల పాల్గొన్నారు.

## నామినేషన్ల సందర్భంగా ఉద్రిక్తత





**సోమందేపల్లి అక్టోబర్ 22 సీమ వార్త సాయంకాలం** మండలంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ నామినేషన్ల సందర్భంగా ఇరువర్గాల మధ్య ఉద్రిక్తత నెలకొంది.నామినేషన్లు వేసేందుకు వచ్చిన వైసీపీ నాయకులు జెండాలు పట్టుకొని “జై జగన్” అంటూ నినాదాలు చేస్తూ లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించారు.దీనిపై టీడీపీ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ నిబంధనలకు విరుద్ధంగా జెండాలతో రాకూడదని సూచించారు.ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకోగా వైసీపీ నాయకులు టీడీపీ నాయకులపై ఎదురుదాడికి ప్రయత్నించినట్లు టీడీపీ నాయకులు ఆరోపించారు.సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకొని పరిస్థితిని అదుపులోకి తీసుకునేందుకు ఇరువర్గాలను చెదరగొట్టారు.నామినేషన్ల కేంద్రం వద్ద ఎలాంటి నినాదాలు, జెండాలతో హల్చల్ చేయకుండా నిబంధనలు పాటించాలని పోలీసులు సూచించారు.వైసీపీ నాయకులు నిబంధనలు ఉల్లంఘిస్తూ వ్యవహరించారని టీడీపీ నాయకులు ఆరోపించారు.

## జనసేన చైర్మన్ అభ్యర్థి, కూటమి కౌన్సిలర్లకు జనసేన నాయకులు విస్తృతంగా ప్రచారం



మడకశిర అక్టోబర్ 22 సీమ వార్త సాయంకాలం స్థానిక ఎన్నికల కార్యక్రమంలో భాగంగా నగర పంచాయతీలో గురువారం చైర్మన్ అభ్యర్థి శారద రాధాకృష్ణ, పదో వార్డ్ కౌన్సిలర్ అభ్యర్థి నారాయణప్పకు జనసేన నియోజకవర్గ ఇన్చార్జ్ ఎన్నికల పరిశీలకులు రంగస్వామి విస్తృతంగా ప్రచార కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జనసేన నియోజకవర్గ ఇన్చార్జ్ ఎన్నికల పరిశీలకులు రంగస్వామి మాట్లాడుతూ నగర పంచాయతీ ఎన్నికల్లో చైర్మన్ అభ్యర్థి శారద రాధాకృష్ణను మెజార్టీతో గెలిపించాలని కోరారు. అదేవిధంగా పదవ వార్డులో కౌన్సిలర్ అభ్యర్థి పోటీ చేస్తున్న ఉమ్మడి టిడిపి అభ్యర్థి నారాయణప్పను మెజారిటీతో గెలిపించాలని ఈ సందర్భంగా కోరారు

## లేపాక్షి జెడ్పీటీసీ అభ్యర్థిగా టీడీపీ తరపున ఎం. చంద్రకళ నామినేషన్

**బాలకృష్ణ ఆదేశాలతో నామినేషన్ దాఖలు..**

**కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు**



లేపాక్షి అక్టోబర్ 22 సీమ వార్త సాయంకాలం : హిందూపురం శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణ ఆదేశాల మేరకు లేపాక్షి జెడ్పీటీసీ అభ్యర్థిగా తెలుగుదేశం పార్టీ తరపున ఎం. చంద్రకళ నామినేషన్ దాఖలు చేశారు. హిందూపురం ఎమ్మెల్యే పీఏ సురేంద్ర సమక్షంలో ఈ నామినేషన్ కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ తరపున అభ్యర్థి నామినేషన్ దాఖలు చేయడంతో పార్టీ శ్రేణుల్లో రాజకీయ సందడి నెలకొంది. ఈ కార్యక్రమంలో జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి ఆనందకుమార్, టీడీపీ సీనియర్ నాయకులు సూర్యప్రకాష్, మాజీ సర్పంచ్ రామచంద్రారెడ్డి, నాగలింగారెడ్డి, కల్లూరు మూర్తి, సింగిల్ విండో నరసింహులు, మారుతి ప్రసాద్, కదిరప్ప, ఆవుల రెడ్డి, లేపాక్షి టీడీపీ పంచాయతీ అధ్యక్షుడు గోవిందు, ఎన్బీకే మూర్తి, వైవీ చంద్ర, నాగ, నాగభూషణ, గంగాధర్, హోటల్ బసవరాజ్, షేక్షా వల్లి, అబ్దుల్ షుకూర్, వెంకటేష్,మూర్తి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై అభ్యర్థికి మద్దతు తెలిపారు. లేపాక్షి మండలంలో పార్టీ బలోపేతానికి, స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయానికి సమష్టిగా కృషి చేయాలని పార్టీ శ్రేణులు ఆకాంక్షించారు.

## ఓడి చెరువు ఒకటి, రెండు ఎంపీటీసీ స్థానాలకు టిడిపి తరపు న నామినేషన్ దాఖలు.





**ఓబులదేవరచెరువు (అక్టోబర్22)సీమవార్త: సాయంత్రం.** ఓడి చెరువు మండలం ఒకటి,రెండు ఎంపీటీసీ స్థానాలకు గురువారం నామినేషన్లు దాఖలు అయ్యాయి.మాజీ జెడ్పిటిసి,తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు,ఎంపీపీ అభ్యర్థి పిట్టా ఓబుల్ రెడ్డి ఎంపీటీసీ-1,కు పోటీ చేసేందుకు బరిలో దిగారు.గతంలో జెడ్పిటిసిగా,ఎంపీపీగా, సర్పంచ్ గా పదవులు అనుభవించారు. టిడిపిలో సుదీర్ఘ అనుభవం ఉన్న నాయకుడిగా ఓడి చెరువు మండలంలోనే పేరు పొందారు. మండల వ్యాప్తంగా 14 ఎంపీటీసీ స్థానాలు ఉండగా ప్రధానంగా దాదాపు ప్రతి గ్రామంలోనూ ఓబుల్ రెడ్డి అనుచరులు, అభిమానులు ఉన్నారు.గతం నుంచి టిడిపిలో పనిచేస్తూ మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి కి కూడా దగ్గరగా ఉంటూ పార్టీ కార్యక్రమాలను కొనసాగిస్తుంటారు. మండలంలోని గ్రామాలలోని ప్రజల్లో అభిమానం కలిగిన, నాయకుడిగా పార్టీలో పేరు ప్రతిష్టలు కలిగిన వ్యక్తిగా ఎంపిటిసి స్థానానికి నామినేషన్ వేయడంతో ప్రత్యర్థి ఎవరైనా ఆయన గెలుపు నల్లేరుపై నడకేనని ప్రజల్లో చర్చ మొదలైంది.అలాగే ఎంపీపీగా పిట్టా ఓబుల్ రెడ్డిని అధిష్టానం ఖరారు చేసినట్లు తెలుస్తోంది.

### ఓడి చెరువు ఎంపీటీసీ-2 స్థానానికి మోపురి అంజినప్ప నామినేషన్

ఓడి చెరువు ఎంపీటీసీ రెండవ స్థానానికి మోపురి అంజినప్ప టిడిపి తరపున నామినేషన్ వేశారు. మండల కేంద్రానికి చెందిన అంజనప్ప సీనియర్ నాయకుడిగా మంచి గుర్తింపు పొందారు.మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డికి విధేయుడుగా ఉంటూ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పనిచేశారు. అలాగే మండలంలో ముఖ్య నాయకులుగా కొనసాగుతున్న పిట్ట ఓబుల్ రెడ్డికి ముఖ్య అనుచరుడిగా ఉంటూ గతంలోని స్థానిక సంస్థలు,సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి తరపున పోటీ చేసిన అభ్యర్థుల గెలుపుకు కీలక పాత్ర పోషించారు. గ్రామపంచాయతీలో తెలుగుదేశం పార్టీ తరపున మంచి నాయకుడిగా గుర్తింపు పొందిన అంజినప్ప ప్రస్తుత ఎన్నికల్లో మొట్టమొదటిసారి ఎంపిటిసి అభ్యర్థిగా ప్రత్యక్షంగా పోటీ చేస్తున్నారు.ఆయన గెలుపు కూడా దాదాపు ఖాయమని ప్రజలు చర్చించుకుంటున్నారు.

Printed, Pulished, Owned by BEEREA ESWARAYYA & Printed at M/S ESWAR Offset Printers D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P.
RNI No: APTEL /25/A2860 & Published at D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P. Editor B. ESWARAYYA Cell :9490860881